

రాజతరంగిణి కథ

# అంతిమ నమస్కృతి

అధికారానికి, అహంభావానికి అవినాభావ సంబంధం ఉంది. ఆభిజాత్యము, అజ్ఞానము తోడయితే ఇంక చెప్పడానికి ఏముంటుంది? రాజులు, రాజరికాలు నిలబడక పోవడానికి ఇదే ప్రధాన కారణం. విరక్తి పాలు హెచ్చయినా కూడా ఇదే పరిణామం సంభవిస్తూ ఉంటుంది. ఏమైనా పాలకులలోనూ దేశభక్తి కొరత పడదని నమ్మడానికి పెక్కు ఆధారాలు కనుపిస్తాయి.

## రాజతరంగిణి

కాశ్మీరు రాజుల చరితం 'రాజతరంగిణి'. కల్హణుడు ఎనిమిది శతాబ్దుల క్రిందట రచించిన 'రాజతరంగిణి' ఇతిహాసం మాత్రమే కాదు; ఒక మహా కావ్యం కూడా.

కొన్నివేల సంవత్సరాల కాశ్మీరు చరిత్ర 'రాజతరంగిణి'. కల్హణుని కాలానికి సమీపంగా మాత్రమే ఆ చరిత్ర వివరంగా 'రాజతరంగిణి'లో చోటు చేసుకొన్నది. ప్రాచీనకాలపు ఇతిహాసంలో కొంత కల్పితంగా గోచరిస్తుంది.

కాశ్మీరుపట్ల కల్హణునికి ఉన్న ప్రేమ అపారమైనది. కాశ్మీరు ప్రకృతి సౌందర్యానికి అవధులు లేవు. కాశ్మీరు చరిత్ర మాత్రం అంత సుందరమైనది కాదు.

'రాజతరంగిణి' ప్రధానంగా రాజుల, రాజకుటుంబాల, ప్రభువుల చరిత్ర. సామాన్య ప్రజల చరిత్ర కాదు.

అనేక కథలకు, గాథలకు కాణాచి అయిన 'రాజతరంగిణి' ఆధారంగా శ్రీ పిలకా గణపతిశాస్త్రి రచించిన కథలలో మొదటిది 'అంతిమ నమస్కృతి'. తదితర కథలను కూడా వరుసగా ప్రచురించగలము.

—ఎడిటర్

---

కాశ్మీర మహారాజ పట్టమహిషి రత్నాంగద మంత్ర భవనం లోలోపలికి నిర్నిమేషంగా నిశ్చలదృష్టి ప్రసరింప జేసి ఉసూరుమని నిట్టూర్చింది.

ఇంతటి అర్ధరాత్రివేళ మహారాజు శంకుకమంత్రితో కలిసి అంత ఏకాంతంగా సుదీర్ఘంగా పర్యాలోచించే రాజకార్యం ఏమయి ఉంటుంది? ఆమె కెంతసేపటికి ఏమీ పాలుపోలేదు. అంతగా అత్యంత ముఖ్యవిషయం ఏమయినా ఉంటే, ప్రధాన సచివోత్తములు పరమేశ్వర భట్టారకులతో సంప్రతించవచ్చునే? వారిని కాదని ఈ శంకుకమంత్రి చెవి కొరకవలసిన అతిరహస్య వ్యవహారం ఏమయి ఉంటుంది?

రత్నాంగదాదేవికి మొట్టమొదటినించి శంకుకమంత్రి ఆకృతిగాని, ముఖవైఖరిగాని బొత్తిగా రుచించలేదు. అతగాడు బాగా బక్కపలచని వ్యక్తి. రవంత ముందుకు వంగిన శిరస్సుతో, చిన్న పొడిదగ్గుతో ఎప్పుడు ఏదో ఆలోచిస్తున్నట్టు కనిపిస్తాడు. మంత్రులెవ్వరు ఎన్నడు వ్యక్తీకరించని భయభక్తులతో, విపరీత వినయంతో మహారాజుతో ప్రసంగిస్తూ అవసరం ఉన్నప్పుడు, లేనప్పుడు అర్థం పర్థం లేని వెర్రిమొర్రి చిరునవ్వులు వెలువరిస్తూంటాడు. రత్నాంగద తన శయ్యాగారంలో మెత్తని హంసతూలికల తల్పంపై మేను వాల్చి విశ్రమించి అల్లంతదూరంలో గవాక్షంలో నించి విస్పష్టంగా గోచరిస్తున్న భర్త ముఖంపై అలముకొన్న తీవ్ర జిజ్ఞాస, మథన తిరిగి తిరిగి పరిశీలించింది. ఆ ధోరణినిబట్టి కాశ్మీర రాజ్య వ్యవహారాలలో భయంకరమయిన అల్లకల్లోల మేదయినా బయలుదేరి ఉండవచ్చునని ఆశంకించింది.

పట్టమహిషి భయాందోళనలకు కొంత అవకాశం లేకపోలేదు. కాశ్మీర రాజ్యమేకాక, రాజధాని శ్రీనగరి కూడా ఆ సమయంలో విపరీతమైన బందిపోటు దొంగతనాలతో, ప్రజల కొట్లాటలతో, ఆర్తనాదాలతో అల్లకల్లోలమయింది! ఒక్కొక్కప్పుడు పట్టపగలే ప్రజలు రాజవీథులలో సంచరించడానికె భయపడి పోతున్నారు!

కాశ్మీరంలో పరిపాలన తిన్నగా కొనసాగనప్పుడు ఒక్కొక్క సమయంలో బ్రాహ్మణ పరిషత్తు రాజసౌధం ప్రాంగణంలోనే ఆమరణాంత ప్రాయోపవేశ దీక్ష ప్రారంభిస్తూంటుంది. ఆ సమయంలో కొంతమంది పూజ్యులయిన విప్రులు అన్నపానాలు పూర్తిగా విసర్జించి తమ అభిలాష నెరవేరకపోతే అలాగే మరణిస్తామని బెదిరిస్తారు. అలాంటి ప్రాయోపవేశదీక్ష ఆరంభం కాబోతున్నదంటే కాశ్మీరాధీశ్వరులే గజగజ వణికిపోతూంటారు! ఒకసారి బ్రాహ్మణ పరిషత్తు ప్రాయోపవేశం ప్రారంభించనున్నప్పుడు రత్నాంగద స్వయంగా కల్పించుకుని అది విరమింపజేసింది. ఆ కాలంలో కాశ్మీర మహీపతి అంధ యుధిష్ఠిరుని ఎడల ప్రజకుగాని, బ్రాహ్మణ పరిషత్తుకుగాని గౌరవ మేమాత్రము లేదు.

అయినా పట్టమహిషి రత్నాంగద ఎడల ఏర్పడిన అపూర్వ పూజ్యభావంతో ఆ పరిషత్తు అప్పటికి ప్రాయోపవేశ సంకల్పం విరమించుకున్నది. ఇటీవలి కాలంలో అంధ యుధిష్ఠిరుని అసమర్థతవల్లనయితే నేమి, దుష్పరిపాలనవల్లనయితేనేమి కాశ్మీర ప్రజకతనిపై నానాటికి ఎంతయినా వైముఖ్యం కలిగింది. కాని రత్నాంగద అంటే ప్రజ కెనలేని గౌరవం. దానికామె సౌశీల్యము, ఔదార్యము, వితరణ, దైవభక్తి ఆదిగాగల సద్గుణాలే ప్రధాన కారణాలు.

పట్టమహిషి స్వయంగా తన రత్నాలంకారాలతో, అపార ధనరాసులతో శ్రీనగరిలో వితస్తానది తీరంలో పరమశివ విష్ణు దైవతాల మహోన్నత దేవళాలు రెండు నిర్మింపజేయించింది. బౌద్ధ పరివ్రాజకుల సుఖ వసతి కనుకూలమయిన విహారా లెన్నో నిర్మింపజేయించింది. వేదవేదాంగాల వ్యాప్తికోసం విద్వాంసుల కగ్రహారాలు ధారాదత్తం చేసింది. ఆమె ఎప్పుడయినా దైవతపూజకోసం శ్రీనగర వీథులలో బంగారు పల్లకీలో విజయం చేస్తున్నప్పుడు ప్రజలు రాజవీథుల కిరువైపుల బారులుదీర్చి నిలిచి చల్లనితల్లి అని చేతులెత్తి మొక్కి జయజయధ్వానాలతో అభినందించేవారు. కాని ఏమి లాభం? ఆమె ఔదార్యం అంతా మహారాజు అవివేకంవల్ల, కన్నుమిన్ను కానని దురన్యాయాలవల్ల ఎందుకు కొరగాక ఈనాటి కీవిధంగా బూడిదలో పోసిన పన్నీరయిపోతున్నది. శ్రీనగరం అంతా నేడు కొందరు మంత్రుల వెనక చేరిన ముష్కరుల కుతంత్రాలతో, దుశ్చేష్టలతో అట్టుడికినట్టు ఉడికిపోతున్నది.

రత్నాంగద కీసారి శంకుకమంత్రి బాగా ముందుకు వంగి ఏలిక కేదో గట్టిగా నచ్చజెపుతున్నట్టు విస్పష్టంగా గోచరించింది. అంతలోనే రాజవీథిలో ఎక్కడో ఓమూల పరమ భయంకరమయిన ఆర్తనాదం వినిపించింది. అది అలాగ మరికొంతసేపు కొనసాగి క్రమక్రమంగా దీనాతిదీనమై గొంతు కోసివేసినట్టు ఒక్కమారుగా అణగారిపోయింది. రత్నాంగదకా ఆర్తనాదం వినగానే ముచ్చెమటలు పోశాయి. శరీరం గజగజ వణికింది. అదేమి ఘోర దురంతమో అనుకున్నది. రాజమంత్రులిద్దరు అది ఆలకించి క్షణకాలం నిశ్చేష్టితులయి చిరునవ్వులు నవ్వుకున్నారు. ఆ సమయంలో మహారాజు కనుదోయి రవంత ముకుళితమయినా పూర్తిగా మూసుకున్నట్టే కనిపించింది.

ఆ నేత్రద్వయివైపు చూడగానే పట్టమహిషికి తన వివాహకాలంనాటి సంఘటన లొకటొకటే కళ్లకు కట్టినట్టు స్ఫురించాయి. కాశ్మీరాధిపతి అంధ యుధిష్ఠిర మహీపతి వాస్తవానికి అంధుడు కానేకాదు. అతనివి చాలా చిన్నకళ్లు. అవి తెరుచుకున్నా మూసుకున్నట్టే కనిపిస్తాయి. అంతేగాని, అతనికి దృష్టిదోషమేమీ లేదు. కనకనే ప్రజానీకంలో అతనికి అంధయుధిష్ఠిరుడన్న పేరేర్పడింది.

పట్టమహిషి రత్నాంగద ఆనాడు కాశ్మీరంలో అంతర్గతమయిన విజయపురి ప్రభువు కుమార్తె,

పి. గణపతిశాస్త్రి

అది సామంత రాజ్యమయినా ఆరోజుల్లో అప్పుడప్పుడు సర్వస్వతంత్రంగా వ్యవహరిస్తూండేది. అందువల్ల అప్పటి కాశ్మీరానికి, విజయపురికి అప్పుడప్పుడు అంతః కలహాలు, యుద్ధాలు సంభవిస్తూండేవి. వాటితో బొత్తిగా ప్రశాంతత లేక అల్లల్లాడిన విజయపురి ప్రభువు రత్నాంగదను కాశ్మీరాధిపతికిచ్చి వివాహం చేస్తే ఆ అనుబంధంవల్ల తన రాజ్యానికి కొంత స్థైర్యం చేకూరగలదని ఆలోచించాడు. రత్నాంగద సహజంగా చక్కనిచుక్క. అందువల్ల అంధ యుధిష్ఠిరుడా వివాహానికెంతో సంతోషించాడు. అయితే మహారాజవంశంలో జన్మించినా యుధిష్ఠిరు డంతగా రూపసి కాడు. అందుచేత రత్నాంగద కా సంబంధం రుచించలేదు. కాని ఆ విషయం తన తలిదండ్రులకయినా తెలియనివ్వలేదు. విజయపురి ప్రజకావిధంగానయినా కొంత మనశ్శాంతి కలిగితే అదే పదివేలని అనుకుని అంగీకరించింది. అయితే మొట్టమొదటగా పట్టమహిషి గౌరవంతో అంతఃపురంలో అడుగుపెట్టినప్పుడు రత్నాంగద కంతకుముందెన్నడు అనుభూతంకాని మహానందం కలిగింది.

శ్రీనగరంలో ఏటువైపు చూచినా వింతవింత రంగుల పూదీవలతో, ఫలవృక్షాలతో కలకలలాడే పుష్పోద్యానవనాలే! ఎంత మండువేసవిలోనయినా ఆ పూదోటల సోయగ మేమాత్రము వసివాడదు! అందులోను రాజప్రాసాదం చుట్టు కన్నులపండువుగా పెరిగిన విశాల పుష్పవని అంటే పట్టపురాణికి కేవలం ఆరోప్రాణమే. నిర్మల నీల సరస్సులో ప్రతిఫలించిన ఆ పూదోట నడుమ నిలిచినప్పు డామె కిక అన్నపానాలే అక్కరలేదని అనిపించేది.

'తానీ ప్రజాసంకులమయిన రాజధాని విడిచి ఒక పూలతీవగా మారిపోతే! తన అలంకారాలన్ని విచిత్ర వర్ణాల పుష్పాలుగా పరిణమిస్తే!' ఆమె ఆలోచన అలాగ సాగిపోయేవి.

అప్పటికప్పుడే అర్ధరాత్రి దాటిపోయింది. ఇంత సేపటినించి ఆమె భర్త మరలిరాకకోసం నిమేష మొక యుగంగా నిరీక్షించింది. కాని యుధిష్ఠిర భూపతి మాత్రం భవనంనించి మరలివచ్చే జాడ కనబడలేదు! రత్నాంగద ప్రాణం విసిగిపోయింది. ఇక వేచిఉండలేక పవ్వళించాలనికూడా అనుకున్నది. అదేక్షణంలో శంకుక మంత్రి లేచి నిలిచి నెమ్మది నెమ్మదిగా మంత్రాగారం నించి నిష్క్రమించాడు.

## 2

భర్త తన శయ్యాగారంలో అడుగు పెట్టగానే రాజ్ఞి జాజ్జ్వల్యమాన దీపకాంతిలో నిస్తేజస్కమయిన ఆయన ముఖవైఖరి రెప్పపాటు లేకుండా రెండుమూడు క్షణాలపాటు పరీక్షించింది. మహారాజే మొట్టమొదటగా ప్రస్తావన ప్రారంభించగలరని ఆశించింది. కాని కాశ్మీరాధిపతి నోట ఒక్క మాటకూడా వెలువడలేదు. రాణి మరి ఆ తటస్థవైఖరి భరించలేక ఉప్పొంగుతున్న దైన్యంతో భర్త పాదాలపై వాలి నమస్కరించబోయింది. ఆ సంఘటన ఎదురుచూడని యుధిష్ఠిరు డామెను కౌగిట పొదివిపట్టి ఎంతో ఆప్యాయంగా లేవనెత్తాడు. రాజ్ఞి గద్గదస్వరంతో ప్రశ్నించింది.

"ఎందు కిలాగ అదేపనిగా మథనపడుతున్నారు? పెద్ద విడ్డూరమేమయినా సంభవించిందా?"

"ప్రధానామాత్యుడే నా రాజ్యం అపహరించి వెయ్యాలని కుతంత్రాలు పన్నుతున్నాడు!"

"పరమేశ్వరభట్టారకులా?"

"అవును. ఆ కృతఘ్నుడే!"

"కాదు! కాదు! నేనిది నమ్మలేను."

"నీవిది నమ్మినా, నమ్మకపోయినా యథార్థం ఇంతే!"

"అయ్యో! ఇలాగని మీ కెవరు నూరిపోశారు?"

"నాకొకరు నూరిపొయ్యాలా? నే నామాత్రం గ్రహించుకోలేనా? వేగులవారందరు నిద్రపోతున్నారను కున్నావా?"

అంధయుధిష్ఠిరుడావేశంతో గజగజ వణికిపోయాడు.

"అయితే ఆ వేగులలో ఎక్కువమంది శంకుక మంత్రి అనుచరులే కదా?"

### కొత్త సంక్రాంతి

ఎన్. గోపి

చలిరాత్రుల కాళ రాత్రు
పుల మూకలు ముసురు కొనగ
రేగుచున్న చీరత్వపు
భోగి మంటయే శరణము.

ఇదేమిటే సంక్రాంతికి
ఎదలో దారుణ వ్యథలు?
ఇవేమిటే నరకానికి
ఎవరో తీసిన దారులు?

పచ్చకోక కట్టి సిగ్గు
పడు కన్నియ సంక్రాంతికి
నేడేలనో కన్నులలో
వేడి ఆవిరులు లేచెను.

ప్రాంగణమున వెలయించెడు
రంగవల్లికలకు బదులు
గుండియ ముంగిట వెలిగెను
కొత్తగ శౌర్యపు రేఖలు.

మంగళ హారతి పట్టరె
బంగరు మా ముద్దరాండ్రు
రమ్మ! రమ్మ! సంక్రాంతీ!
ప్రతాపోజ్జ్వలాననమై. *

పట్టమహిషి ప్రశ్నతో రూక్షమయిన అధిక్షేపం ప్రతిధ్వనించింది. తాను విశ్వసించిన వేగులవా రొకవేళ శంకుకమంత్రి అనుచరులేమో అన్న అనుమానం యుధిష్ఠిరుని హృదయంలో తళుక్కుమని మెరిసింది. అయినా పట్టపురాణి సమక్షంలో తన అనుమానంకాని, తప్పిదం గాని బాహాటంగా అంగీకరించగలడా మహారాజు! ఆ వేగు లెంతమాత్రము శంకుకమంత్రి అనుచరులు కాజాలరని నొక్కి వక్కాణించాడు.

అంతలోనే రత్నాంగద తిరిగి ప్రభువు పాదాలపై వాలి వలవలా వాపోయింది.

"ఆ శంకుకమంత్రే వివిధంగా వేగుల ముఖతః ప్రధానామాత్యులపై విద్వేషం రగిలింపజేస్తున్నారు! ఆయన మన రాజ్యాని కంటకుడై పెట్టనికోట! మహనీయులు! నా విజ్ఞప్తి రవంత చిత్తగించండి. న్యాయాన్యాయాలు తిన్నగా పరిశీలించనిదే వారి ఎడల క్రోధం వహించకండి! ఈ శంకుకుడు దురాత్ముడు! ధూర్తుడు! విషం పూసిన మెత్తని కత్తి! నా మాట నమ్మండి!"

తన కన్నివిధాల ఆత్మీయుడనుకుంటున్న శంకుక మంత్రిని గూర్చి పట్టమహిషి ఆ తీరులో దుమ్మెత్తిపోసేసరికి అంధ యుధిష్ఠిరుడు ఒక్కమారుగా తోక తొక్కిన కోడెత్రాచులా కస్సుమన్నాడు.

"గోముఖవ్యాఘ్రంవంటి ఆ పరమేశ్వరభట్టారకుని కుతంత్రాలన్ని పొద్దస్తమానము రాణివాసంలో పూలతీగల నంటిపెట్టుకుని తిరిగే నీ కెలాగ అవగాహన అవుతాయి! ఆ పాపి ఈపాటి కిప్పుడే పరలోకం చేరుకుని ఉంటాడు —"

"అయ్యో! ఆ బ్రహ్మణ్యమూర్తి నిప్పుడే చంపించి వేశారా? ఇది ఎప్పుడు జరిగింది?"

"ఇవింతకుముందు ప్రధానామాత్యుని భవంతి నుండి వెలువడిన ఆర్తనాదం వినలేదా?"

"అయ్యో! ఆ ఘోరాక్రోశాలన్ని వారి కుటుంబానివేనా?"

మహారాజు మరి మాట్లాడలేదు. పట్టమహిషికి తన పాదాలకింది భూమి ఒక్కమారుగా లోలోపలికి కుంగిపోతున్నట్టు అనిపించింది. మరి తమకిక తరణోపాయం లేదన్న వైరాశ్యం తటాలున అలముకున్నది. ఇక నిగ్రహించుకోలేకపోయింది.

"అయ్యో! ఎంతటి దురన్యాయం జరిగిపోయింది! ఈ ఘోర పాపాని కిక ప్రాయశ్చిత్తం లేదు. ఇప్పటికయినా నా విన్నపం రవంత విశ్వసించండి! ఆ శంకుక మంత్రిని వెంటనే అమాత్యపదవినుండి తొలగించండి. వేరెవరినయినా ప్రధానామాత్యులుగా నియమించండి!"

మహారాజిక భరించలేకపోయాడు.

"శంకుకమంత్రిమీద ఈ లేనిపోని కట్టుకథలన్ని కల్పించినవా రెవరు?"

రత్నాంగద నోట ప్రత్యుత్తరం వెలువడే సూచన అయినా స్ఫురించలేదు. ఆమె అలాగే పట్టి శిలా ప్రతిమలా నిర్ఘాంతపడి నిశ్చలదృష్టితో భర్త ముఖం పరిశీలించింది.

"ఆ దురాత్ముతెవ్వరో వెల్లడించదలుచుకోలేదా?"

యుధిష్ఠిరుడు తన దురాగ్రహం భరించలేక రవంత గొంతెత్తి గర్జించాడు.

"అయ్యో! ఇంతమాత్రాని కొకరు పనికట్టుకుని వచ్చి చెప్పవలిసినదేమున్నది! రాణివాసంలో ఎవరి నోట విన్నా ఇదే 'మాట!"

"ఆఁ! ఆఁ! అలాగా! అయితే అంతఃపురంకూడా రాజద్రోహుల కందరికి ఆటపట్టయిందన్నమాట!"

ఆవిధంగా గర్జిస్తూనే ఒక్క అంగలో మహారాజు అక్కడినించి వెళ్ళిపోయాడు.

రత్నాంగద కాహఠాత్సంఘటన మరింతగా మనోవేదన కలిగించింది. మహారాజు అప్పటివరకు తనతో అంత పరుషంగా, అమర్యాదగా ఎన్నడు ప్రసంగించ లేదు. తనఎడల ఆయన కెందు కంతగా వైముఖ్యం కలిగిందో ఎన్నెన్నివిధాల ఆలోచించినా అవగాహన కాలేదు.

పైగా పరమద్రోహి అని అంతఃపురంలో అందరు ఆడిపోసుకుంటున్న శంకుకమంత్రిఎడల భర్త కంతటి అభిమానము, నమ్మక కుగడానికి గల కారణమేమో ఆమె కసలే బోధపడలేదు. ఆ సచివునిమీద చేసిన నిందారోపణలవల్లనే తనపై భర్త కంతటి ఆగ్రహం కలిగి ఉండవచ్చునని ఆమె పసికట్టివేసింది. 'ఆహా! శంకుక మంత్రి ఎంతటి చతురుడు! ఎంతటి కుతంత్ర కుటిలుడు! ప్రధానామాత్యుల ఎడలనేకాక నాపై కూడా మహీపతికి వైముఖ్యం కలిగిస్తున్నాడు కాబోలు! ఎంతటి విధివైపరీత్యం! ఇది అంతా చిట్టచివరి కేవిధంగా పరిణమించగలదోకదా!' అన్నఆందోళనమనస్సులోఅంతట ముసురుకున్నది. బహుశః రాణివాసంలో అంతట శంకుక సచివునిపై అలముకున్న ప్రవాదాల కన్నింటికి తానే ప్రధానకారణమని మహారాజు భావించి ఉండవచ్చునని కూడా ఆమె భయపడింది. ఏది ఏమయినా ఇప్పటి కయినా తిరిగి పతిని తిన్ననయిన దారిలో పెట్టి రాజధానిలో బయలుదేరిన అల్లకల్లోలం అణచివేయించాలని ఆమె తీర్మానించుకున్నది.

'కాని ప్రభువు తన హిత వాకర్ణించి తిన్నగా దారికి వస్తారా?' అన్న అనుమానం తిరిగి ఆమె నదేపనిగా వేధించింది. ఆ సమయంలో యుధిష్ఠిర భూపతి పరిపాలన ప్రారంభంలో వ్యక్తములయిన విజ్ఞత, దక్షత, వివేకము ఆదిగా గలవన్ని పట్టమహిషికి జ్ఞప్తికి వచ్చాయి. ఆ తరుణంలో భర్త ఆదరణ, అప్యాయత, ప్రగాఢానురాగము తలుచుకోగానే ఆమె కనుగొలకులలో వేడి వేడి కన్నీటి బిందువు లుద్భవించాయి. ఇప్పు డామె కించు మించుగా ముప్ఫయ్యో ఏడు దాటబోతున్నది. ఇటీవలనే మహారాజు వేరొక సచివుడు చండవర్మ తనూజ చందన గంధిని వివాహం చేసుకున్నాడు. అది రాజవంశమర్యాద కనక తన మనస్సెంతగా వికలమయినా ఆమె దాని కంగీకరించింది. ఆ మంత్రి ఈ నూతన బాంధవ్యం వల్లనయినా మరింతగా ప్రభుభక్తితో మసులుకోగలరని ఆశించింది. అందువల్ల కూలిపోబోతున్న భర్త ప్రాభవ సౌధం బాగా దృఢపడగలదని ఎంతయినా ఉవ్విళ్లూరింది. కాని ఆ చండవర్మకూడా గాలి ఏటువైపు తిరిగితే అటే మొగ్గుతున్నట్టు కనిపిస్తున్నాడు. రాజ్యకార్యాలలో అంటీఅంటనట్టు వ్యవహరిస్తున్నాడు! కాని పైపైకి మహారాజంటే పడిచచ్చిపోతున్నట్టే ప్రసంగిస్తున్నాడు. ఆ వ్యవహారం తలపెట్టగానే యుధిష్ఠిర భూపతి ఈ కష్టాలన్ని గడిచి గట్టెక్కగలరన్న ఆశ రత్నాంగద హృదయంలో చాలావరకు అంతరించింది. అయినా భర్త కన్నివిధాలా చేదోడువాదోడుగా నిలిచి శాయశక్తులా రాజ్యవ్యవహారాలన్ని క్రమక్రమంగా తిన్ననయిన దారిలో తీర్చదిద్దాలని నిశ్చయించుకున్నది.

## 3

అలాగలాగ మరికొన్ని వారాలు గడిచిపోయాయి. అయినా రత్నాంగద అభిలషించినట్టు కాశ్మీర రాజ్య వ్యవహారా లేమాత్రము చక్కబడలేదు. పైగా అవి నానాటికి మరింతగా అధ్వాన్నంగా పరిణమించాయి. ఏ క్షణంలో ఏ ఘోరావద మీద విరుచుకుపడగలదో అని యుధిష్ఠిర భూపతి కడుగడుగునా సంశయం కలిగింది. అయినా రాణి కేవలం దైవేచ్ఛమీదనే భారం వేసి కానున్న దేదో కాక మానదని ధైర్యం చిక్కబట్టుకున్నది.


పండిత
డి. గోపాలాచార్యులవారి
ఓజోవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు-17

శ్యామలా నగలు


NO 823 FREE CATALOGUE NO 871
బంగారము కవరింగ్ చేయ బడినవి.
VR Arts
REGISTERED
శ్యామలా గోల్డు కవరింగ్ వర్క్సు
చిలకలపూడి.పో. మచిలీపట్టణం.(A.P.)

ముళ్లపూడి వెంకటరమణ
** రచనలు **
ఓటిచ్చేవారూ పుచ్చుకునేవారూ
తప్పక చదవవలసిన పుస్తకం
రాజకీయ బేతాళ పంచవింశతిక 5-00
రాధాగోపాలం 2-50
జనతాఎక్స్‌ప్రెస్ 2-50
ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ 2-00
ఋణానందలహరి 2-00
గిరీశం లెక్చర్లు 2-50
నవ్వితే నవ్వండి 2-50
బుడుగు-1 2-00

నవోదయ పబ్లిషర్సు
ఏలూరు రోడ్ * విజయవాడ-2

డౌవిడట్
కొరముట్లు
ప్రపంచ
బజార్లను
ఆకర్షించినవి

హిందుస్థాన్ డౌవిడట్ టూల్స్ లిమిటెడ్,
హెచ్. బ్లాక్, కన్నాట్ సర్కస్, న్యూ ఢిల్లీ-1.

కాని కాలం గడుస్తున్నకొద్దీ ఆమె కిక తన రాణీ వాసం చిరకాలం కొనసాగదేమో అన్న విపరీత భీతి పట్టుకుని అనుక్షణము వేధించింది. ఆనాటి ప్రాతః కాలంలో ఆమె ఉద్యానవనంలో విహరిస్తున్నది. అప్పటి కప్పుడే చలికారు తొలగిపోతూ నవవసంతం నలువైపులా తొంగి చూస్తున్నది. ప్రతి కొమ్మలోను, రెమ్మలోను వ్యాపిస్తున్న ఆ అత్యద్భుత శోభ ఆమె నానంద తన్మయతతో ముంచివేసింది. ప్రతి చిన్నారి మొగ్గ, చిగురు, పూవు తన్నెంతో ఆప్యాయతతో పలకరిస్తున్నట్టు భావించుకుని రెప్పవాల్చక పరిశీలిస్తూ ఉమారుమని నిట్టూర్చింది. అల్లంతదూరంలో విడిపోతున్న తెలిమంచుతెరలలో తళతళలాడుతున్న దేవాలయ గోపురాల పైడికలశాలవైపు చూచి చేతులెత్తి నమస్కరించింది. దేవకాంచనాలు, మల్లెలు, మొల్లలు, మందారాలు ఆదిగా గల పూలతీగల నల్లన సమీపించి అలవోకగా కౌగలించుకున్నది. పట్టపురాణి చెక్కిళ్లపై కవోష్ణ బాష్పాలోకేధార కట్టి ప్రవహించాయి. బాగా దూరంలో వితస్తానది తరంగ ఘోషలా క్రమక్రమంగా పెచ్చు పెరిగిపోతున్న పెనుసవ్వడి ఏదో వినిపించింది. ఆ నదీమ తల్లిని ఆత్మాంతరాళంలో నిలుపుకుని భక్తివినమ్రతతో అనేక ప్రణామా లర్పించింది. కాని మరికొన్ని నిమేషాలలోనే అది ఆ వాహినీదేవత అలల రొద కానే కాదని స్పష్టపడిపోయింది.

అంతలోనే ఆ ఘోష భయంకరమయిన యుద్ధ భేరీ నినాదంలా నలువైపుల ప్రతిధ్వనించింది. మరి కొన్ని క్షణాలలోనే అది మహారాజసౌధం సింహద్వారం సమీపించింది. వందలకొలది సైనికులు విచ్చుకత్తుల తళతళలతో రాజసౌధం చుట్టుముట్టి భయంకర సింహనాదాలతో భూ నభోంతరాళం దద్దరిల్లజేస్తున్నారు! మరికొందరు సౌధం లోపల ప్రవేశించి ద్వార పాలకుల నందరిని ఎక్కడి కక్కడే సంహరించివేస్తున్నారు! ఘోరాక్రందనాలతో మహారాజ భవనం మాటిమాటికి మారుమోగుతున్నది.

శంకుకమంత్రి ఒరనించి దూసిన కరుకు కత్తితో మంత్రాగారంవైపు దూసుకుపోతున్నాడు. సర్వసేనా నాయకు డాతని నత్యంత భయభక్తులతో అనుసరిస్తున్నాడు. పట్టమహిషి కా దృశ్యం చూడగానే నోరెండిపోయింది. ఘోరాతిఘోరమైన ఆపద ఏదో త్వరలోనే దాపురించనున్నదని నిశ్చయించుకున్నది. తొందర తొందరగా మంత్రాగారంలోనికి పోవాలని సంకల్పించుకున్నది. కాని కాళ్లాడలేదు. తన చుట్టూ ఉన్న పూల తీవలవైపు చూచి వేడి నిట్టూర్పొకటి విడిచిపెట్టి చెక్కిళ్లపై జాలువారుతున్న కవోష్ణబాష్పాలతో, తడబడుతున్న అడుగులతో తొందరగా మంత్రభవంతి వైపు సాగిపోయింది.

అది మధ్యమధ్యన స్తంభా లెక్కడ లేకుండా విశాలంగా నిర్మించిన భవంతి. తానెక్కడయినా రహస్యంగా నిలిచి ఆలకించడాని కేమాత్రము అవకాశం లేదు. ఇంత వరకు వచ్చిన తరవాత మరి నిగూఢంగా ఆలకించ వలసినంత అగత్యం ఏమున్నదని రత్నాంగద తనలో తానే ప్రశ్నించుకున్నది. వెంటనే రాజమంత్రు లిరువురు సమాసీనులయిన ప్రదేశానికే పోయి అల్లంతదూరంలో నిలుచున్నది.

తలవనితలంపుగా జరిగిన పట్టమహిషి రాకతో వారిద్దరు కొంచెం కంగారుపడి సగౌరవంగా లేచి నిలుచున్నారు. రాణి మహీపతికి అలవోకగా నమస్కరించి సమీపంలో వేరొక స్వర్ణాసనంపై సమాసీనురాలయింది. మహారాజు తిరిగి తన సింహపీఠి అలంకరించాడు.

అంతలోనే భయంకర యుద్ధభేరీ నినాదం చెవులు చిల్లులు పడేటట్టు భోరుమని మారుమోగింది. మంత్రి అది విన్నా అలాగే నిలుచున్నాడు. అంధ యుధిష్ఠిరుని ముఖాన కత్తివాటు వేసినా ఒక్క నెత్తురు చుక్కయినా లేదు.

"మహాప్రభూ! తామిక ఒక్కక్షణం ఆలస్యం చేసినా మీ ప్రాణాలకే మోసం రాగలదు! దయుంచి నా మనవి చిత్తగించండి!"

మహారాణి కా ఘోర ప్రాణాపాయమేమో రవంతయినా అవగాహన కాలేదు. లోలోపల అట్టుడికినట్టుడికిపోయింది.

"ఏమి టా ప్రాణాపాయం?"

మంత్రివైపు రూక్షంగా చూసి కస్సుమని బుస కొట్టింది.

అయినా శంకుకమంత్రి ఆవంతయినా చలించ లేదు. అసలే వంగిన శిరస్సు మరింతగా వంచి నెన్నుదుటిపై దోసిలి కట్టి సవినయంగా విన్నవించాడు:

"మహారాజ్ఞీ! ప్రభువు పరిపాలనవల్ల ప్రజలలో అల్లకల్లోలం నానాటికి పెచ్చుపెరిగిపోతున్నది. అమాత్య పరిషత్తు ఇక మార్గాంతరం లేక మహారాజు రాజ్య పరిత్యాగం ఒక్కటే దీనికిక పరమశరణ్యమని నిర్ణయించింది. సపరివారంగా మీరిక వెనువెంటనే అరణ్యానికి నిష్క్రమిస్తే ఒకించుకయినా అపాయం కలగ జాలదని సవినయంగా విన్నవిస్తున్నది. ఏమి చెయ్యను? ఎంతగా ప్రయత్నించినా నేను మీ రాజ్యాధికారం సంరక్షించలేకపోయాను! నన్ను మన్నించండి."

ఆ విజ్ఞప్తి చిట్టచివర మంత్రి గొంతు దుఃఖావేశంతో తొణికిసలాడింది.

అప్పటికే రత్నాంగదకు జరిగిన ఘోరం అంతా కళ్లకు కట్టినట్టు స్పష్టంగా బోధపడిపోయింది. అయితే మంత్రి ముఖం చూస్తే అతని దుఃఖావేశం అంతా ఒక గొప్ప నటన అని అవగాహన అయింది. ఆ సాధ్వి ఇక తన దురాగ్రహం నిగ్రహించుకోలేకపోయింది.

"నీవే ఈ కల్లోలాని కంతటికి మూలకారణం! నేను మొట్టమొదటినించి నీవొక పయోముఖ విష కుంభానివని ఏలినవారి కెరిగిస్తూనే ఉన్నాను! అయినా వారు నా మాట లక్ష్యపెట్టలేదు."

అయినా మంత్రి తొణకలేదు. లీలగా చిరునవ్వు అతని పెదవులపై మొలకెత్తింది.

"ఇప్పుడీ గతజల సేతుబంధనంవల్ల ప్రయోజన మేమిటి? చండవర్మ చేసిన కుట్ర వ్యవహారం మీరే మయినా గమనించారా?"

"ప్రభువువారికి స్వయంగా తమ కుమార్తెనిచ్చి వివాహం చేసిన చండవర్మకూడా శత్రువర్గంలో చేరి పోయారా?"

"వారే దీనికంతటికి మూలకందం! రాజదంపతుల నవశ్యం నిర్బంధించి రాజ్యం చేజిక్కించుకోవలెనని వారి దురాశ. కాని దానికి నే నడ్డువచ్చాను."

రాజ్ఞి, నిలువునా నిర్ఘాంతపడింది. ఈ మంత్రులలో ఎవ రాత్మీయులో ఎవరు శత్రువులోకూడా ఆమె కవగతం కాలేదు. బహుశః అధికారం చేజిక్కించుకోవడం కోసం శంకుక చండవర్మ లిద్దరిమధ్య ప్రబల సంఘర్షణ ప్రారంభమయి ఉండవచ్చునని ఆమె కొక

మొటిమలు మాయమగును

[illegible]

నిక్సోడెర్మ్ (NIXODERM)తో రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, శుభ్రముగాను [illegible] గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, తామర, [illegible] మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మరంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించి ఎడల మీ చర్మ వ్యాధులు నివారించబడును. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, శుభ్రముగాను చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

ప్రసిద్ధ రచయిత్రుల
సరిక్రొత్త ప్రచురణలు..

వేల్పూరి సుభద్రాదేవిగారి
మంచు బొమ్మలు 5.00
(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఉగాది నవలా పోటీలలో ప్రథమ బహుమతి నందిన నవల)

కుమారి ఎ. శ్యామలారాణి గారి
జీవవాహిని 6.00
(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సీరియల్‌గా ప్రచురితమైన నవల)

'కాదంబరి' గారి
ఇందుమతి 2.50
(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఉగాది నవలా పోటీలలో ద్వితీయ బహుమతి నందిన నవల)

మున్నంగి రంగనాయకమ్మగారి
గులాబి పూసింది 5.00
పందిట్లో పెళ్ళవుతోంది 3.00

కోడూరి కౌసల్యాదేవిగారి
శాంభక్యాత్ము 3.50
సుప్రభాతం 4.00

యం. సులోచన గారి
ప్రేమలూ-పెళ్ళిళ్లూ 5.00

వి. పి. సర్వీసు లేదు
ముందుగా డబ్బు పంపువారికి పోస్టేజి ఉచితం
ప్రతులకు
ఇతర వివరాలకు
విజయసారథి పబ్లికేషన్స్
విజయవాడ-2.

అనుమానం కలిగింది. ఆ పరిస్థితులలో రాజ్యం విడిచి పెట్టి అరణ్యవాసం చేయవలసివచ్చినా తమ ప్రాణాల కపాయం కలగబోదన్న నమ్మిక ఆమె కేమాత్రము కలుగలేదు.

అదే క్షణంలో అంధ యుధిష్ఠిర మహీపతి మంత్రి ముఖవైఖరి పరిశీలించి ప్రశ్నించాడు.

"మేమీవిధంగా సింహాసనం విడిచినా ప్రాణాపాయం కలగదన్న నమ్మిక కలగడంలేదే!"

"మహాప్రభూ! తామీ వ్యవహారంలో అణుమాత్రము ఆందోళనపడనక్కరలేదు. దానికి నేను మంత్రులందరి పక్షాన మాట ఇస్తున్నాను. అయితే సముచిత పరివారంతోను, ధన కనక వస్తువాహనాలతోను మాత్రమే ప్రస్థానమై తామిక కాశ్మీరదేశం విడిచి హిమాలయారణ్యంలో నివసించాలి. తమ భృతికి అవసర మయిన స్వల్ప ధనంతప్ప అమూల్య రత్నరాసులేవీ వెంటబెట్టుకుని పోరాదు. ఇది మంత్రిపరిషత్తు అంతిమ నిర్ణయం."

"నేనీ ఘోరావమానాన్ని అంగీకరించదలుచుకోలేదు! ఇక్కడే నిలిచి ఇదేవిధంగా పట్టమహిషీ గౌరవంతోనే ప్రాణపరిత్యాగం చేస్తాను!"

రత్నాంగద పట్టరాని క్రోధావేశంతో గజగజ వణికి పోయింది. విపరీతమయిన గద్గదికతో ఆమె మాట తడబడింది.

యుధిష్ఠిరు డది గమనించి ప్రగాఢమయిన అను నయ స్వరంతో ఆవేశపడవలదని ప్రార్థించాడు. ప్రభువు అనునయం తిన్నగా వినిపించుకోకుండానే రాజ్ఞి తొందరగా అంతఃపురికి మరలిపోయింది. అంధ యుధిష్ఠిరు డామె ననుసరించబోయాడు. అంతలోనే శాయ శక్తులా ప్రయత్నించి అతణ్ణి తిరిగి సింహాసనంమీద అధిరోహింపజెయ్యగలనని మాటఇచ్చి వెనువెంటనే రాజ మందిరంనించి వెడలిపోవలిసినదని శంకుకమంత్రి వేడుకొన్నాడు.

అదే క్షణంలో పెడబొబ్బలతో, హుంకరింపులతో, సింహనాదాలతో సైనికులు కొందరు రాజభవంతిలో ప్రవేశించిన పెనుసవ్వడి వినిపించింది. యుధిష్ఠిరు డనుక్షణంలోనే తడబడుతున్న అడుగులతో అభ్యంతర మందిరంలో ప్రవేశించాడు.

ఆపైన రాజభవనంనుండి రాజదంపతుల నిష్క్రమణం యావత్తు అతి త్వరితంగా జరిగి పోయింది. వారితోబాటు చిన్నరాణి చందనగంధి, నలుగురైదుగురు అంతఃపుర పరిచారికలు, పరిచారకులు అరణ్యనివాసానికి ప్రయాణమయినారు. రత్నాంగద ఒక సామాన్యమయిన శిబికలో కూర్చున్నది. అంధ యుధిష్ఠిరు డొక అశ్వంపై అధిరోహించాడు. మిగిలిన పరిచారికా పరిచారకులు తగినన్ని సంభారాలతో వారి ననుగమించారు.

అంధ యుధిష్ఠిరు డా విధంగా రాజ్యపరిత్యాగం చేస్తున్నందుకు పౌరులెవ్వరు విచారించలేదు. కాని రత్నాంగదాదేవి ఆ తీరులో నిష్క్రమిస్తున్నందుకు పురవాసులలో కంట తడిపెట్టనివారెవ్వరు కానరాలేదు. పట్టమహిషి ఎంతో ఆప్యాయతతో చేతులెత్తి వారంద రికీ నమస్కారా లాచరించింది. కాని ఆ సమయంలో ఆమె ముఖంలో ఎక్కడా! అవంతయినా విచారచ్ఛాయ కానరాలేదు. ఆ తరుణంలో శంకుకమంత్రివల్ల భయంతో తదితర మంత్రులుగాని రాజోద్యోగులుగాని ఎవ్వరు వారి ననుసరించలేదు. అయినా ఆ రాణి దాని కెంతమాత్రము చింతించలేదు. 'శోకస్వభావమే అంత!' అని శోకావేశ నష్టమౌతున్నది.

అప్పటికప్పుడే పొద్దు బాగా వాలింది. రాజదంప తులు తమ పరివారంతో క్రమక్రమంగా శ్రీనగరం దాటి పరిసర ప్రాంతంలో ప్రవేశించారు. మరికొంత

## సంక్రాంతి వేళ

### రజనీప్రియ

అరుణోదయ రాగ హేమ
కిరణజాల లలితకాంతి
అవనీతలిపై భానుని
అనురాగమువోలె వెలిగె.

చిరునవ్వుల పొన్యలక్ష్మి
అరుదెంచినయంత, ప్రకృతి
మంచు ముత్తెముల సింగా
రించె జగతి నెల్లయెడల.

ఏగుదెంచు పౌష్యరమకు
స్వాగతమిడు చందమ్మున
రంగవల్లికల శోభలు
పొంగె ప్రతి గృహాంగణమున.

ముద్దబంతి పూలతోడ
ముద్దులొలుకు గొబ్బెమ్మలు
ముద్దరాలి కోర్కులెల్ల
అద్దములై ప్రతిఫలించె.

మంచుతెరల మాటున నిదు
రించు రసిక హృదయమ్ములు.
పరవశింప మేలుకొలుపు
పాడుచు హరిదాసు తిరిగె.

చెలరేగిన భోగిమంట
చలి గుండియ నంటినంత
'కొక్కొరొకో' అనుచు మొరసె
కుక్కుటముల జయకాహళి!

మెరిసెను దరహాసకాంతి
నరనారీ నయనమ్ముల
విరిసె భావశబలత ప్రతి
హృదయము సంక్రాంతి వేళ! *

సేపటికి సూర్యాస్తమయం సమీపించింది. అంత లోనే అకస్మాత్తుగా బందిపోటుల గుంపొకటి వారి పరి వారంమీద విరుచుకుపడి పరిచారకులను వధించి పరిచారికలతోబాటు చందనగంధినికూడా అపహరించుకు పోయింది. రాజదంపతుల వాహనాలయినా వారు విడిచిపెట్టలేదు. ఆ సమయంలో తమ విశ్వాసాయుతలు ముకొని వారెంతయినా విచారించారు. చందనవల్లి మీది అక్కసుతో శంకుకమంత్రే ఆ అకృత్యం చేయించి ఉండవచ్చునని రత్నాంగద అనుమానించింది. ఇప్పుడు ఇక మిగిలిన తమకుకూడా భయంకర మృతి అనతికాలం లోనే సంభవించవచ్చునని ఆమె భయపడింది. కాని అటువంటి దారుణమేదీ జరగలేదు. కాని వారిద్దరు కేవలం కాలినడకతోనే మున్ముందుకు సాగిపోవలిసిన దురవస్థ కలిగింది.

సూర్యు డస్తమించబోయే సమయానికి ఆ రాజ దంపతు లిరువురు అతి త్వరితంగా ప్రస్థానం సాగించి కాశ్మీర దేశం సరిహద్దులో ఉన్న అరణ్యంలో ఒక ప్రశాంత విప్రాశ్రమం పరిసరంలో ప్రవేశించారు. అల్లంతదూరంలో పరమబ్రహ్మణ్యులయిన బ్రాహ్మ ణులు కొందరు సర్వసంగపరిత్యాగంతో నిశ్చల దృఢ దీక్షలతో తపశ్చర్యకోసం నిర్మించుకున్న ఆశ్రమాల నవలోకించగానే రాజ్ఞి కొకింత ఊరట కలిగింది.

ఆ తపస్వుల పర్ణకుటీరాలలోనుండి వెలువడిన సన్నని పొగ వలయాకారంలో తిరుగుతూ నీరెండలో నల్లని నీడ లుదయింపజేస్తూ సన్నని తెలి తెలి మంచుతెరలలో విలీనమయింది. గూళ్లవైపు వస్తున్న విహంగాల కలకూజితాలు నలువైపుల వ్యాపించాయి.

ఆ ఆశ్రమాలవైపు సాగిపోయేముందు రాజ్ఞి రత్నాంగద కుంకుమభరిణలో పదిలపరుచుకున్న కాశ్మీర క్షేత్రి పవిత్ర మృత్తిక తన నొసట తిలకంగా దిద్దుకున్నది. తెల్లతెల్లని హిమాచల శిఖరాలనుండి కానవస్తున్న తన జన్మభూమివైపు చూచి నెన్నుదుటిపై నిండుదోసిలి కట్టి చెక్కిళ్లపై జాలువారు తున్న కవోష్ణ బాష్పాలతో ప్రణమిల్లి ప్రార్థించింది.

"కాశ్మీరజననీ! నీవు సాక్షాత్తు పర్వతరాజపుత్రి పార్వతీదేవివే! తల్లీ! నిన్ను తిరిగి ఈ పుట్టుకలలో దర్శించు కోగలనో, లేదో? మావల్ల ఏదో మహాపరాధం జరిగి నందువల్లనే నీవీ విధంగా బహిష్కరించివేయుచున్నావు! ఇప్పటికయినా కరుణించి మమ్మిల నిరువురిని తిరిగి నీ ఒడిలో చేర్చుకో! నీవంటి కరుణామయికాక మాపై మరి ఎవ్వరు జాలిపడగలరు!"

తిరిగి ఆమె సుదూరంలో కానవస్తున్న తన కన్నతల్లివంటి కాశ్మీర భూమివైపు చూచి ప్రగాఢ భక్తితో సాగిలపడి నమస్కరించింది. ఆమె భక్తిభావం పరికించి వివశుడయిన అంధ యుధిష్ఠిరభూజాని కూడా అదేవిధంగా దేవి సరసనే సాగిలపడి సాష్టాంగ నమస్కారం సమర్పించాడు.

పాపం, అతని హృదయంలో శంకుకమంత్రి తిరిగి తనకు రాజ్యాధికారం ప్రసాదించగలడన్న ఆశ పూర్తిగా అంతరించలేదు. కాని రాజ్ఞి ఎడదలో మాత్రం అటువంటి అభిలాష అవంతయినా పొటమరించలేదు. ఈ ఘోరాపద కంతటికి శంకుకమంత్రే ప్రధానకారణ మని ఆమె గట్టి నమ్మిక. దానిలో పొరబాటేమి లేదు.

అయితే ఎలాగయినా తన కన్నతల్లి కాశ్మీర ధాత్రీ దేవి ఒడిలో చేరి చిట్టచివరికి ఆ పునీత మృత్తికలో లీనమయిపోవాలనిమాత్రమే త్రికరణశుద్ధిగా ఆమె అభిలషించింది.

అదే కోరికతో అదే తీరుతో ముమ్మారు ఇనుమడి స్తున్న భక్తిభావంతో మాతృభూమికి సాష్టాంగ నమస్కారా లర్పించింది. ★